సాక్షి వరంగల్

సోమవారం | 7 | ఆగస్టు | 2023

గరిష్టం/కనిష్టం
32°/25°
వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాద కరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గద్దర్ మృతికి ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

నర్సంపేట : ప్రజా గాయకుడు గద్దర్ మృతికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్‌తో పంచుకున్న వేదికలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. గద్దర్ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు.

గద్దర్‌తో సెల్ఫీ దిగాను..



చెన్నారావుపేట: ప్రజా గాయకుడు గద్దర్‌తో సెల్ఫీ దిగడం చెప్పలేని ఆనందం కలిగించిందని మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన ఊరుగొండ సాయికుమార్ తెలిపారు. గత ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలు, అంబేడ్కర్ స్టూడెంట్ యూనియన్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయనను కలిసి సెల్ఫీ దిగాను. చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పిన గద్దర్ మాట ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటు తెలిపారు.

పెర్కవేడుతో గద్దర్‌కు అనుబంధం



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుతో గద్దర్‌కు అనుబంధం ఉంది. గ్రామానికి చెందిన ఐత అనిల్, గారె కరుణాకర్, చిన్నపాక భద్రయ్య, రాజు, కిరణ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆయనను ఆహ్వానించారు. అదేవిధంగా గ్రామంలో తెలంగాణ ఉద్యమ బహిరంగసభకు సైతం గద్దర్ వచ్చారు. తన పాటలతో గద్దర్ గ్రామస్తులను ఎంతో ఉత్తేజపరిచారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



హన్మకొండ: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులోని జయశంకర్ విగ్రహానికి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, హనుమకొండ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అలాగే.. వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స.. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గట్ల దయాకర్‌కు డాక్టరేట్



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన గట్ల దయాకర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ఈమేరకు తమిళనాడు టీచర్స్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ చీఫ్ కేకే షైన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. 'హయ్యర్ సెకండరీ స్టూడెంట్స్ అకడమిక్ రెజిలెన్స్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఎమోషనల్ అడ్జస్ట్‌మెంట్ అండ్ టీచర్-స్టూడెంట్' అంశంపై ప్రొఫెసర్ ఎస్.మణి పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌ను సర్పంచ్ పెండ్యాల మమతారాజు, ఎంపీటీసీ నాగరబోయిన మమతామోహన్, ఉప సర్పంచ్ జంగా రాజిరెడ్డి తదితరులు ఆదివారం అభినందించారు.

కలెక్టరేట్‌లో నేటి గ్రీవెన్స్ రద్దు

కరీమాబాద్ : వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

ఆగిన కోట్లాది గానమా..

మూగబోయిన విప్లవ గొంతుక

- ఉమ్మడి జిల్లాతో గద్దర్‌కు అనుబంధం
- ఆయన స్ఫూర్తితో అనేక మంది పోరుబాట
- ప్రజాగాయకుడు ఇకలేరని కన్నీరుమున్నీరు
- సంతాపం తెలిపిన ఓరుగల్లు కవులు, కళాకారులు



హన్మకొండ కల్చరల్ : ఎక్కడ అన్యాయం జరిగినా.. తనకే జరుగుతున్నట్లు అన్వయించుకుని.. అందుకు తగ్గట్టుగా పాటలు అల్లి.. తన దరువుతో ఉర్రూతలూగించిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్. ఆయన ఇక లేరనే వార్త విన్న ఉమ్మడి వరంగల్ కళాకారులు, కవులు, రచయితలు, ప్రజలు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. తన ఆటపాటలతో ఉద్యమాలను రగిల్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు.. ఓరుగల్లుతో విడదీయరాని అనుబంధం ఉంది. తన గళంతో మేధావులు, భూస్వాముల బిడ్డలను సైతం సాయుధ పోరాటం వైపు ఆకర్షితులను చేశారు. అనేక మందిని పీపుల్స్ ఆర్మీగా తయారుచేశారు. ఇప్పుడా పాట మూగబోయింది. పీపుల్స్‌వార్ (మావోయిస్టు) పార్టీ కీలక ఘట్టాలకు వేదికైన ఓరుగల్లులో.. గద్దర్ ఉద్యమ ప్రస్థానం ఇలా..

- కారంచేడు దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ గద్దర్ చేపట్టిన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ నుంచి ఉద్యమకారులు, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి.
- **1997 :** సెప్టెంబర్‌లో వరంగల్ డిక్లరేషన్ సదస్సుకు హాజరయ్యారు.
- **2007 :** మణుగూరు వద్ద గోదావరి నుంచి ప్రారంభమైన కళాకారుల శాంతియాత్ర అన్ని జిల్లాల్లో 24 రోజులపాటు సాగింది.
- **2008 మే 25, 2009 :** హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన తెలంగాణ సాంస్కృతిక కళాకారుల సమావేశంలో పాల్గొన్నారు.
- **2009 :** వరంగల్ ప్రజాసంఘాలతో కలిసి తెలంగాణ ప్రజాఫ్రంట్, ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జిల్లా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, కళాకారులతో కలిసి తెలంగాణ ఉద్యమంపై ధూంధాం నిర్వహించారు.
- **2010 :** ప్రత్యేక తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని ఐదు రోజులు జిల్లాకు చెందిన ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, కళాకారులతో కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లో పాదయాత్ర చేశారు. చివరిరోజు ఆజంజాహి మిల్లు మైదానంలో జరిగిన సభలో గద్దర్ తన పాట, ప్రసంగంతో ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపారు.
- **2010 అక్టోబర్ 6న** హనుమకొండ టీఎన్జీఓ భవన్‌లో జరిగిన వరంగల్ జిల్లా జేఏసీ స్టీరింగ్ సమావేశంలో గద్దర్ పాల్గొన్నారు.
- **2012 :** 'ఓపెన్ కాస్ట్ హఠావో సింగరేణి బచావో' నినాదంతో చేపట్టిన బొగ్గు గనుల సంరక్షణ ఉద్యమం సందర్భంగా ములుగులో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వరకు ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు.
- **2022 జూన్‌లో** గద్దర్ వరంగల్‌లో జరిగిన తెలంగాణ అమరవీరుల సంతాపసభలో పాల్గొన్నారు.

- వివరాలు 8లో ▶

వేతనాలు రాక వెతలు

- జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల ఇబ్బందులు
- మూడు నెలలు గడిచినా అందని జీతాలు
- రెన్యూవల్ చేయడంలో సర్కారు నిర్లక్ష్యం
- ఏజెన్సీని రద్దు చేసి, రెగ్యులర్ చేయాలి
- ప్రభుత్వానికి సిబ్బంది విజ్ఞప్తి



నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి

నర్సంపేట రూరల్ : వేతనాలు లేక నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారిని రెన్యూవల్ చేయకపోవడంతో మూడు నెలలు గడిచినా వేతనాలు రావడం లేదు. నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ప్రస్తుతం 100 పడకలతో కొనసాగుతోంది. ఇందులో 22 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు మూడు కేటగిరీల్లో వేతనాలు పొందుతున్నారు. నాలుగో తరగతి కార్మికులకు రూ.15,600, డీఈఓ, ఏఎన్ఎం కార్మికులకు రూ.19500, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్‌నర్సులకు ప్రభుత్వం రూ.22,000 చొప్పున చెల్లిస్తోంది. సుమారు 12 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు కూడా రావడం లేదని, మూడు నెలలు గడిచినా వేతనాలు రావడం లేదని పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం మార్చిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏజెన్సీని రెన్యూవల్ చేయాల్సి ఉంది. కానీ, ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు రెన్యూవల్ ఊసేలేదు. ఏప్రిల్ నెలవరకు వేతనాలు అందించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులను అడుగగా రెన్యూవల్ కాగానే జీతాలు పడుతాయని చెబుతున్నారు. ఎప్పుడు రెన్యూవల్ అవుతాయోనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, అర్హులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఇటీవల నర్సంపేట జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని సైతం అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏజెన్సీని రద్దు చేసి, అర్హులను రెగ్యులర్ చేయాలని, సకాలంలో వేతనాలు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్‌ను రద్దు చేయాలి..



సమాన పనికి సమాన వేతనం అందించాలి. చాలీచాలని జీతాలతో కాలం వెల్ల దీయడం కష్టమతోంది. రెండు, మూడు నెలలకోమారు వేతనాలు అందించడంతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి, ప్రభుత్వమే నేరుగా నెలనెలా వేతనాలు అందించాలి.

- పుప్పాల ప్రశాంత్, ఔట్‌సోర్సింగ్ కార్మికుడు

ఇబ్బంది పడుతున్నాం..



ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెల వేతనాలు అందించాలి. రెండుమూడు నెలలకోమారు అందించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబం గడవడం కష్టంగా మారుతోంది. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే ప్రతి నెల వేతనాలు అందించాలి.

ఆకుల శంకర్, ఔట్‌సోర్సింగ్ కార్మికుడు

వైద్యవిధాన పరిషత్ దృష్టికి తీసుకెళ్లా



ఔట్ సోర్సింగ్ కార్మికుల రెన్యూవల్ నిలిచిపోయిన విషయం వాస్తవమే. దీంతో వారి జీతాలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని వైద్య విధాన పరిషత్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా. ఆయన కూడా సానుకూలంగా స్పందించి త్వరలో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, రెన్యూవల్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

- డాక్టర్ గోపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

నేటి నుంచి మిషన్ ఇంద్రధనుష్

- పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్
- 20 రకాల వ్యాధుల నివారణకు టీకాలు
- 12 వరకు కొనసాగనున్న కార్యక్రమం



మిషన్ ఇంద్రధనుష్ లోగో

గీసుకొండ : పిల్లలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం మిషన్ ఇంద్రధనుష్ పేరుతో కార్యక్రమాన్ని చేపడుతోంది. 0–5 ఏళ్లలోపు పిల్లలకు పలు రకాల వ్యాధులు రాకుండా ఉండటానికి ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. ఈ నెల 7 నుంచి 12 వరకు మొదటి విడత వ్యాక్సినేషన్ చేయనున్నారు. రెండో విడత సెప్టెంబర్ 11–16, మూడో విడత అక్టోబర్ 9–14 మధ్య వాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలని కార్యాచరణ రూపొందించారు. జాతీయ ఇమ్యూనైజేషన్ కార్యక్రమం కింద రోగ టీకాలు వేసుకోని గర్భిణులు, చిన్నారులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అలాంటి వారందరికీ టీకాలు వేయించాలన్నదే ముఖ్య ఉద్దేశం.

చెక్‌పెట్టే వ్యాధులు ఇవే..

డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, బాల్యంలో క్షయ, హైపటైటిస్–బి, మెనింజైటిస్, నిమోనియా తీవ్ర రూపం హీమోఫిలస్, ఇన్ఫ్లూయేంజా రకం–బి, రోటా వైరస్, డయేరియా, జననీస్ ఎన్సెఫాలిటిస్ తదితర వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని రూపొందించారు. పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయనున్నారు. కాగా, జిల్లాలో 367 సెషన్లలో వ్యాక్సినేషన్ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు డీఐఓ చల్లా మధుసూదన్ తెలిపారు.

యూ–విన్‌తో ఎక్కడైనా టీకా తీసుకోవచ్చు

గర్భిణుల, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలంటే కార్డు తీసుకుని దగ్గరలోని ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. ఒక్క రోజు టీకా వేయాల్సిన సమయం మరిచిపోతే ఇక అంతే.. అన్నట్లు ఉంటుంది. ఈ సమస్య లేకండా యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం (యూ–విన్)ను కేంద్రం ప్రారంభించింది. యూ–విన్ పోర్టల్‌లో ప్రతీ గర్భిణి వివరాలు నమోదు చేస్తారు. ప్రసూతి అనంతరం శిశువుల వివరాలు నమోదు చేస్తారు. ఈక్రమంలో వారికి షెడ్యూల్ ప్రకారం టీకాలు ఇచ్చేలా కుటుంబ సభ్యులకు, వైద్య సిబ్బందికి పోర్టల్ నుంచి సంక్షిప్త సమాచారం అందుతుంది. వైద్య సిబ్బంది కూడా వారి వివరాలను పోర్టల్‌లో ముందుగా నమోదు చేస్తారు. దీంతో టీకా తీసుకునే తేదీ, సమయం తెలుస్తుంది. ఎక్కడి నుంచైనా టీకా తీసుకునే అవకాశం ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు.

పాకాలలో పర్యాటకుల సందడి



పాకాల సరస్సు మత్తడి వద్ద పర్యాటకులు

ఖానాపురం: పర్యాటక ప్రాంతమైన పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పాకాలకు తరలివచ్చి అందాలను వీక్షించారు. సరస్సు మత్తడి వద్ద నీటిలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు. సెల్ఫీలు దిగుతూ పాకాల అందాలను బంధించుకున్నారు.

వికేంద్రీకరణతోనే గ్రామాల అభివృద్ధి

నర్సంపేట : అధికార వికేంద్రీకరణతోనే గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, ప్రగతి, సమగ్ర అభివృద్ధిపై చర్చ అనే అంశంపై పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో వందల మంది ప్రాణత్యాగాలకు, అనేక మందిపై పీడీ యాక్టులకు కారణం కాంగ్రెస్ పార్టీ కారణమని పేర్కొన్నారు. నాడు తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నేడు తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

పెద్దికి సీఎం ప్రశంసలు..

నర్సంపేట నియోజకవర్గంలోని ప్రధాన నీటి వనరు అయిన పాకాల సరస్సుకు గోదావరి జలాల తరలింపుతో పాటు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ అనుసంధానంపై సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగించారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తనతో పోరాటం చేసి పాకాల ప్రాజెక్టును సాధించారని, నేడు పాకాల ఆయకట్టు కింద రెండు పంటలు దర్జాగా పండుతున్నాయంటే ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పుణ్యమే అంటూ అభినందించారు.

కేంద్రం విధానాలపై ఉద్యమించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గుంపల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. ఈనెల 9, 10 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా వాల్ పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విచ్ఛిన్నం చేసిందని మండిపడ్డారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు దేశానికి సంపద సృష్టికర్తలు అని ప్రధాని మోదీ చెప్పడం కార్మిక వర్గాన్ని అవమానించడమే అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చిన సీఎం కేసీఆర్ ఏ ఒక్క కార్మిక సంఘాన్ని చర్చలకు పిలువలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు, స్కూల్ స్వీపర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపల్లి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, మియాపురం గోవర్ధన్, జిల్లా నాయకులు మైదం యాకయ్య, ఆటో యూనియన్ నాయకులు సీహెచ్.ఉపేందర్, చిన్నాల సారంగం, హమాలీ నాయకులు పూగ యాదగిరి, రమేష్, రాజు, పత్తి అనంత రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

వే..ద్ద వాహనం!



రాయపర్తి నుంచి వరంగల్ వైపు వెళ్తున్న భారీ వాహనం

రాయపర్తి: మండల కేంద్రం మీదుగా అతిపెద్ద వాహనం వెళ్తుండగా స్థానికులు ఆదివారం ఆసక్తిగా తిలకించారు. 90 టైర్లు కలిగిన లారీ భారీ కంటైనర్లను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మీదుగా వరంగల్ వైపు తీసుకెళ్తోంది. పైన ఉన్న విద్యుత్ తీగలను కర్రలతో పైకి అంటూ తీసుకెళ్తుండగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు వీక్షించారు. ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

లబ్.. 'డెబ్'

- ప్రాభవం కోల్పోతున్న కేయూ ఎస్‌డీఎల్‌సీఈ
- అధికారులు ప్రతిపాదించిన కోర్సులు 42
- 21కే డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతి
- కోర్సుల నిర్వహణ ప్రజంటేషన్ సరిగాలేకపోవడమే కారణం
- దూరవిద్య కేంద్రంలో తగ్గుతున్న అడ్మిషన్లు, ఆదాయం
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) ప్రాభవం కోల్పోతోంది. అధికారుల వైఫల్యం కారణంగా వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 1989లో ఎంఫిల్ కోర్సుతో ప్రారంభమై.. 1991–92లో డిగ్రీ కోర్సులు, తర్వాత పీజీ కోర్సుల స్థాయికి ఎదిగింది. ఉమ్మడి ఏపీతోపాటు పొరుగు రాష్ట్రాల వారికి సైతం ప్రవేశం కల్పించారు. ఆ తర్వాత పరిణామ క్రమంలో యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) అనుమతులు తప్పనిసరయ్యాయి. అలాగే, కొన్నేళ్లుగా కేవలం తెలంగాణ రాష్ట్రం వరకే అడ్మిషన్లు పరిమితమయ్యాయి. చివరకు కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోనే అడ్మిషన్లు ఉండాలని, పరీక్ష కేంద్రాలు సైతం అక్కడికే పరిమితం చేయాలనేది నిబంధనలు వచ్చాయి. ఒకప్పుడు ఏ విద్యార్హతలు లేకున్నా అభ్యర్థులకు ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించి డిగ్రీ కోర్సుల్లో నేరుగా అడ్మిషన్ కల్పించారు. ఇప్పుడు ప్రవేశ అర్హత పరీక్షను తొలగించి ఇంటర్ పూర్తిచేసిన వారికి డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎంబీయూ స్టడీ సెంటర్లు ఇప్పుడు తగ్గిపోయాయి. ఈ విద్యాసంవత్సరంలో ముఖ్యమైన కోర్సుల నిర్వహణకు యూజీసీ డెబ్ అనుమతి నిరాకరించినట్లు ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌కు సమాచారం అందింది. దీంతో దూరవిద్య ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఎందుకంటే కోర్సులు తగ్గిపోయి అడ్మిషన్లు రాకుంటే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వారిలో తలెత్తుతున్నాయి.

సగం కోర్సులకే అనుమతి..

కేయూ దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ ఇతర డిప్లొమా కోర్సులు కలిపి 24 ఉండేవి. 2018 నుంచి 2023 వరకు అడ్మిషన్లు జరిగాయి. కొన్నికోర్సులకు డిమాండ్ ఉన్నా.. మరికొన్ని కోర్సుల్లో అంతంత మాత్రంగానే అడ్మిషన్ల అయ్యాయి. ఈ విద్యాసంవత్సరంలో ప్రస్తుత కోర్సులతోపాటు కొత్తవి కలిపి మొత్తం 42 కోర్సులకు అనుమతివ్వాలని యూజీసీ డెబ్‌కు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ టి.శ్రీనివాస్‌రావు ప్రతిపాదించారు. అయితే, అందులో 21 కోర్సులకే అనుమతి లభించినట్లు డైరెక్టర్‌కు సమాచారం అందింది.

ముఖ్యమైన కోర్సులకు నిరాకరణ..

బీఏ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఎల్ఐఎస్సీతోపాటు ఎమ్మెస్సీ గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులకు డెబ్ అనుమతి నిరాకరించింది. వీటితో పాటు బీఏ కోర్సులో చేరేవారు ఎక్కువగా ఉంటారు. 2003–04లో ప్రవేశపెట్టిన ఎమ్మెస్సీ సైకాలజీ రెండేళ్ల కోర్సుకు బాగా డిమాండ్ ఉంది. వివిధ వృత్తుల్లో ఉండే వారు కూడా ఈకోర్సులో ప్రవేశాలు పొందుతున్నారు. ఫీజుల ద్వారా ప్రతి ఏడాది రూ.30లక్షల వరకు ఆదాయం వస్తోంది. అలాంటి కోర్సుకు కూడా అనుమతి లభించలేదు. ఎంఎల్ఐఎస్సీని గత ఏడాది ప్రవేశపెట్టగా అనుకున్న మేర అడ్మిషన్లు జరిగాయి. ఎమ్మెస్సీ గణితం, ఎన్విరాన్‌మెంటల్ కోర్సులకు డిమాండ్ అంతంత మాత్రమే అయినప్పటికీ అవీ ముఖ్యమైనవే.

లోపం జరిగిందెక్కడ..?

కోర్సుల అనుమతికి ప్రతిపాదించాక వాటి నిర్వహణ ఎలా ఉందనే విషయంలో ప్రజంటేషన్ సరిగాలేకపోవడమే అనుమతుల నిరాకరణకు కారణమని తెలుస్తోంది. డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు అనుభవం ఉన్నా ఎక్కడ లోపం జరిగిందనే చర్చ జరుగుతోంది. డెబ్ అడిగిన వాటికి సమాచారం ఎందుకు ఇవ్వలేకపోయారనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో డైరెక్టర్లు ఢిల్లీకి వెళ్లి ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని అనుమతి వచ్చేలా ప్రయత్నం చేసేవారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రయత్నం జరగలేదని, యూజీసీ డెబ్ అడిగిన పలు అంశాలు.. ఇక్కడినుంచి పంపిన ప్రతిపాదనల్లో లేకపోవడం వల్లే అనుమతికి నిరాకరించిందనే చర్చ జరుగుతోంది.

ఈసారి సెమిస్టర్ సిస్టమా.. ఇయర్ వైజ్ స్కీమా..

యూజీసీ డెబ్ నియమ నిబంధనల ప్రకారం దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ సిస్టమ్ పెట్టాలి. రెండు మూడుసార్లు సెమిస్టర్ సిస్టంతోనే అడ్మిషన్లు అని చెప్పి ప్రవేశాలు కల్పించారు. సంబంధించిన పుస్తకాలు రూపొందించడంలో జాప్యం కారణంగా తిరిగి వర్సిటీ స్టాండింగ్ కమిటీలో ఆమోదింపజేసుకొని ఇయర్ వైజ్‌గానే పేర్కొంటూ వార్షిక పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. యూజీసీ డెబ్‌కు ప్రతిపాదించేటప్పుడు మాత్రం సెమిస్టర్ సిస్టమ్ అని ప్రతిపాదించడం గమనార్హం. రెండు రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. అందులో సెమిస్టర్ సిస్టం అంటారా.. లేక ఇయర్ వైజ్ స్కీం అని పేర్కొంటారా అనేది ఆసక్తికరంగా మారింది. వివరణ కోసం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్‌రావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదిస్తే లిఫ్ట్ చేయడం లేదు.

పాడితో రైతుల ఆర్థికాభివృద్ధి

నెక్కొండ : పాడి పశువులతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ అన్నారు. రెడ్లవాడ శివారు పిట్టకాయలబోడు తండా జీపీ పరిధిలోని మత్తడి తండాలో ఆదివారం ఒక్కొక్కరికి రెండు చొప్పున పది మంది రైతులకు లేగదూడలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక అన్నారు. ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు అరవింద్, ఉప సర్పంచ్ భూక్య వీరన్న, గోశాల ప్రతినిధులు మిట్టు, వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఉషారాణి

ధర్మసాగర్(వేలేరు): భార్యకు బలవంతంగా విషం తాగించి భర్త, అతని కుటుంబ సభ్యులు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని గొల్లకిష్టంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన ఉషారాణిని వేలేరు మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామానికి చెందిన బత్తుల సతీష్‌తో ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉషారాణికి ఇద్దరు ఆడ కూతుళ్లు జన్మించారని గత కొంత కాలంగా అదనపు కట్నం రూ.10 లక్షలు కావాలని సతీష్, అతని కుటుంబ సభ్యులు వేధించేవారు. ఈ క్రమంలో ఈ నెల 4న వారి వ్యవసాయ భూమి వద్ద సతీష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ఉషారాణిని తీవ్రంగా కొట్టారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి బలవంతంగా విషం తాగించారు. అనంతరం వారే ఉషారాణి విషం తాగిందని, ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని తండ్రికి సతీష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే బంధువులతో కలిసి ఆస్పత్రికి వెళ్లి కూతురిని ఆరా తీయగా బలవంతంగా తాగించారని తెలిపింది. దీంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

జనగామ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం జనగామలోని వెంకన్నకుంటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన వంగర సందీప్ (24) పట్టణంలోని వెంకన్నకుంటలో సెలూన్‌షాప్ పెట్టి జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఎప్పటిలాగే షాప్‌కు వచ్చి ఎవరూ లేని సమయంలో షాప్‌లోనే ఉరి వేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నిఖిల ఉంది.

విద్యుదాఘాతంతో పాడిగేదెల మృతి

దామెర: విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని కోగిల్వాయిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోల్కొండ సాంబయ్యకు చెందిన మూడు పాడిగేదెలు మేతకోసం గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌ను గేదెలు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. బాధిత రైతుకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసకుంటామని విద్యుత్‌అధికారులు హామీ ఇచ్చారు.

విప్లవ దివిటీ గద్దర్



తెలంగాణ ప్రజా గాయకుడు, పాటల యుద్ధ నౌక, విప్లవ దివిటీ గద్దర్ ఆదివారం ఆకస్మికంగా మృతిచెందారు. గద్దర్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో సామాజిక ఉద్యమాలు, ర్యాలీలు, ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొని తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. బయ్యారం గుట్టపై లభిస్తున్న ఉక్కుపై ఆదివాసీలకే హక్కు ఉండాలని గద్దర్ పోరాడారు. మలి విడత తెలంగాణ సాధన ఉద్యమంలో జనగామ జిల్లా బైరాన్‌పల్లి నుంచి కడవెండి మీదుగా తెలంగాణ అమరుల దీపయాత్ర ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం ఆరోగ్యం విషమించి గద్దర్ మృతి చెందారు. దీంతో ఉమ్మడి జిల్లాకు ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాతో అనుబంధం
- పలు ధూంధాం కార్యక్రమాల్లో ఆటాపాట
- ప్రజలను చైతన్య పరిచేలా కార్యక్రమాలు
- నింగికెగిసిన విప్లవ తార

ఆటాపాటలతో చైతన్యం


అమరుల దీపయాత్రలో పాల్గొన్న గద్దర్

దేవరుప్పుల: గద్దర్‌తో జనగామ జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉంది. 1979 నుంచి 1983 వరకు చాపకింద నీరులా కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ వ్యాప్తి క్రమంలో జనగామ జిల్లాలో మేధావి, విద్యార్థి, ప్రజాకవులతో ప్రజాగాయకుడిగా సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే జననాట్యమండలి రాష్ట్ర సారధిగా గద్దర్ వ్యవహరించడంతో జిల్లా నుంచే అత్యధిక కళాకారుల చేరారు. 1989లో పీపుల్స్‌వార్ పార్టీకి అప్పటి సీఎం చెన్నారెడ్డి లీగల్ పీరియడ్ ఇచ్చారు. దీంతో తొలుత జనగామలోనే గద్దర్ బహిరంగ సభ నిర్వహించి ప్రజాసమస్యల సాధనతోపాటు సమసమాజ స్థాపన లక్ష్యంగా పెద్దఎత్తున యువత చేరేలా తన ఆటాపాటలతో చైతన్యం కలిగించారు. 1999లో కరీంనగర్ కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసిన జనగామ జిల్లా కడవెండికి చెందిన మావోయిస్టు ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్ అంత్యక్రియలకు ప్రభుత్వం నిర్బంధాలను అధిగమించి వేలాది మంది నివాళుర్పించేలా తన ఆటపాటలతో చైతన్య పరిచారు. మైదనా ప్రాంతంలో నక్సల్ పార్టీ ప్రభావం తగ్గిన క్రమంలో దొడ్డి కొమురయ్య స్వగ్రామం కడవెండిలో పలు సామాజిక ఉద్యమ పోరాటాల్లో పాల్గొనడం అనివార్యంగా మారింది. 2007 మలివిడద తెలంగాణ సాధన ఉద్యమంలో జనగామ డివిజన్ పరిధి బైరాన్‌పల్లి నుంచి కడవెండి మీదుగా తెలంగాణ అమరుల దీపయాత్ర ప్రారంభించారు. 2011లో బచ్చన్నపేట మండలం కేశిరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని గద్దర్ ఆవిష్కరించారు. రాష్ట్ర సాధనలో గద్దర్ తనదైన శైలిలో దీపారాధన, గీతారాధనతో కార్యక్రమం చేపట్టారు.

'చిట్యాలోడా' అనేవారు..

- సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్


డాక్టర్ సి.నారాయణరెడ్డి, గద్దర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మిట్టపల్లి సురేందర్ (ఫైల్)

టేకుమట్ల: విప్లవ సాహిత్యంలో ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తూ ప్రజా ఉద్యమ పోరాటంలో ప్రజా యుద్ధనౌకగా గద్దర్ సాహిత్యంలో నాకు ఎంతో వెన్నుదన్నుగా నిలిచే వారు. గద్దర్‌ను కలిసిన ప్రతీసారి నన్ను ప్రేమగా చిట్యాలోడా బాగున్నవా అంటుండేవారు. గతంలో ఉమ్మడి చిట్యాల మండలంలో నా స్వగ్రామం కావున నన్ను చిట్యాలోడి గానే పిలిచే వారు. ఇద్దరం కలిసి ఉద్యమ సమయంలో ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఘంటసాల ఇంటర్నేషనల్ ట్రస్ట్-వంశీ ఫౌండేషనల్ ఆధ్వర్యంలో వంశీ టాలీవుడ్ ఫిలీం మ్యూజికల్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ సి.నారాయణరెడ్డితో పాటు గద్దర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జీవితంలో మర్చిపోలేని సంఘటన.

ఆటాపాటలతో ఉర్రూతలూగించిన గద్దర్


గొల్లచర్ల సభలో ప్రసంగిస్తున్న గద్దర్ (ఫైల్)

డోర్నకల్: డోర్నకల్ మండలంలో 2017 డిసెంబర్ 17న పర్యటించిన ప్రజా గాయకుడు గద్దర్ తన ఆటాపాటలతో స్థానికులను ఉర్రూతలూగించారు. డోర్నకల్ మండలం గొల్లచర్లలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్) మహాసభలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం డోర్నకల్ లోని పలు వీధుల్లో పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. బంకట్‌సింగ్‌తండాలో రైల్వే ఉద్యోగి బానోత్ హరిరాం ఇంట్లో కొద్దిసేపు సేద తీరారు. నాడు తనను కలుసుకునేందుకు వచ్చిన అభిమానులను అప్యాయంగా పలకరించడాన్ని స్థానికులు గుర్తు చేసుకున్నారు.

ఉద్యమాలతోనే పరిచయం



2006లో హనుమకొండ కేడీసీ గ్రౌండ్‌లో జరిగిన ధూం ధాంలో గద్దరన్నతో పాటు పాల్గొన్నా. గద్దర్‌తో నాకు ఉద్యమాలతోనే పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి పలు జిల్లాల్లో జరిగిన సభల్లో గద్దరన్నతో కలిసి తెలంగాణ వచ్చేంత వరకు ఆటపాటల్లో పాల్గొన్న. గద్దరన్నకు జోహార్లు.

-సూడమల్ల అశోక్, బహుజన సాంస్కృతిక సమాఖ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ

బయ్యారం ఉక్కుపై గద్దర్ పోరాటం


బయ్యారం గుట్టపై ఉన్న ఇనుపరాయిని పరిశీలిస్తున్న గద్దర్ (ఫైల్)

బయ్యారం: బయ్యారం గుట్టపై లభిస్తున్న ఉక్కుపై ఆదివాసీలకే హక్కు ఉండాలని ప్రజా యుద్ధనౌక గద్దర్ పోరాడారు. 2013 సంవత్సరంలో తెలంగాణ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని బయ్యారం ఉక్కుపై ఆదివాసీలకు హక్కు కలిగే వరకు పోరాడుదామని తోటి ఉద్యమకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ధూం..ధాం కార్యక్రమంలో సైతం పాల్గొని ఈ ప్రాంత వాసుల్లో గుర్తింపును తెచ్చుకున్నారు.

విరసం సంతాపం

జనగామ : గద్దర్ మృతిపై విప్లవ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ కమిటీ కన్వీనర్ కోడెం కుమారస్వామి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ పీడిత ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తన ఆటపాటతో గళం విప్పే గద్దర్ గొంతుక మూగపోవడం తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కవులు, మేధావులు, కళాకారులు, ప్రజాసంఘాలు తోడ్పాడాలని కోరారు.

ఆయన పాట పాడేవారు.. నేను డోలు వాయించేవాడిని


గద్దర్‌తో గాజుల గోవర్ధన్ (ఫైల్)

హసన్‌పర్తి: 'జననాట్య మండలిలో గద్దర్‌తో రెండేళ్ల పాటు పనిచేశా.. 25 మంది సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చేవారం. గద్దర్ పాట పాడుతుంటే నేను డోలు వాయించే వాడిని' అని దళిత బహుజన సాహిత్య అకాడమీ జిల్లా చైర్మన్(భీమారానికి చెందిన) గాజుల గోవర్ధన్ గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఇటీవల గద్దర్ కమారుడి వర్ధంతికి హాజరైనట్లు వెల్లడించారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటని గోవర్ధన్ అన్నారు.

మానుకోటలో పదివేల మంది కళాకారులతో ర్యాలీ


గద్దర్‌తో ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ (ఫైల్)

మహబూబాబాద్: తెలంగాణ యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్‌కు మానుకోట జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. గద్దర్ నిర్వహించిన శాంతి ర్యాలీకి తెలంగాణ ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. 2007 ఫిబ్రవరి 9న ఐక్య కార్యచరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ధూంధాంకు గద్దర్ హాజరయ్యారు. సుమారు పదివేల మంది కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, అల్లం నారాయణ, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, జయరాజ్ మధుప్రియ తదితరులు పాల్గొన్నారు. అదే ఏడాది ఫిబ్రవరి 10న కేసముద్రం మండల కేంద్రంలో పలు కార్యక్రమాల్లో గద్దర్ పాల్గొని తెలంగాణ ఆవశ్యకతపై వివరించారు.

పాట అంటే గద్దరన్నదే..



నేను మొదటగా గద్దర్‌ను సినిమాలో చూశా. పాట అంటే గద్దరన్న పాటే. 1980లో కాకతీయ యూనివర్సిటీకి విద్యార్థి సంఘాల మీటింగ్‌కు వచ్చినపుడు గద్దరన్నతో మాట్లాడిన. ఆ తర్వాత తెలంగాణ ప్రజా ఫ్రంట్, ఐక్యకార్యాచరణ కమిటీ ఉద్యమ కార్యక్రమాల్లో మాతో పాటు పాల్గొనేవారు. ఉద్యమాలకు పాటలతో ప్రాణం పోసిన గద్దరన్న వరంగల్‌లో ఎక్కడ కార్యక్రమాల జరిగిన మా ఇంటికి వచ్చి భోజనం చేసేవారు. గద్దరన్న కంఠం మూగబోయిందని తెలిసి ఆయనకు జోహారులర్పిస్తున్నా.

-రమక్క, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు

ఆయన ఒక విప్లవ శంఖం..



ఆయన ఒక విప్లవ శంఖం. జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా తాను పాడిన హిందీ, తెలుగు పాటలు విప్లవ బాటపై నడిపించాయి. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ధూంధాంలు చేసిండు. ఆయనతో నాకు గొప్ప సంబంధాలు ఉన్నాయి. గద్దరన్నకు దామెర మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి అవినాభావ సంబంధం ఉంది. కామ్రేడ్ మురళీమోహన్ స్థూపం ఆవిష్కరణకు గద్దన్న పాట పాడిండు. ఆయన మరణ వార్తను తట్టుకోలేకపోతున్న.

-వరంగల్ శ్రీనివాస్, గాయకుడు, సినీ సంగీత దర్శకుడు

లాల్ సలాం గద్దరన్నా..



2013లో హైదరాబాద్ తిరుమల గిరిలోని గద్దరన్న ఇంటికి వెళ్లి నేను రాసిన తెలంగాణ విశిష్టతల కవితా సంకలనం జిగర్ పుస్తకాన్ని అందజేశా. ఆయన పాటల ప్రవాహం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపే అమూల్యమైన మాటలు.'ఆటపాటలతో విప్లవాల వీరంగాలు ఆడినావు అన్నా... ఓ విప్లవ బిడ్డా ... నిన్నెట్లమరిచేను నినుగన్న ఉద్యమాల పురుటిగడ్డ!' నీ మీద వ్యాసం రాయమని అడిగితే పెద్ద వ్యాసం రాస్తిని, నీకు ఆది అందజేయలేదు, కాలం అడ్డుకున్నది, అది అముద్రితంగా నా దగ్గర్నే ఉన్నదన్నా.. జోహార్లు! లాల్ సలాం!

-అనిశెట్టి రజిత, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సామాజిక కార్యకర్త

ఉద్యమాలతోనే హక్కులు సాధ్యమవుతాయని..



గద్దరన్న మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్న. ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు చేస్తేనే తెలంగాణ రాష్ట్రం, హక్కులు సాధ్యమవుతాయని అనేవారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు 2010 నుంచి గద్దర్ నాయకత్వంలో జరిగిన ప్రతి ఉద్యమంలో గద్దర్‌తో నాకున్న అనుబంధం మరిచిపోలేను. గద్దర్ నాయకత్వంలో బొగ్గు బాయిలను బొందల గడ్డలుగా మార్చొద్దు అంటూ ఓపెన్‌కాస్ట్ హఠావో సింగరేణి బచావో అంటూ సాగిన ఉద్యమంలో సింగరేణి కార్మికులకు జరుగుతున్న నష్టాలను తెలిపి మేల్కొల్పిన మహత్తర ఘట్టం గొప్పది.

-నల్లెల్ల రాజయ్య , వరంగల్ రచయితల సంఘం అధ్యక్షుడు

గద్దర్ పాటలు వింటూ పెరిగాను..



చిన్ననాటి నుంచి గద్దర్ పాటలు వింటూ పెరిగాను. తెలంగాణ ఉద్యమం 2009లో నల్లగొండలో మొదటి సారిగా గద్దర్‌తో వేదిక పంచుకున్న. 'ప్రజల యుద్దనౌక గుండె ఆగిపోయేనా.. గద్దరన్న మమ్ము వీడి వెళ్లిపోయేనా.. ఎర్రజెండా నేడు నేలకొరిగేనా ప్రశ్నించే గొంతు పయనమైపోతున్నదా/ నువ్వు లేవనే మాట గుండె తట్టుకోలేనన్నది/నువ్వు లేని రాజ్యం భవిత ఊహించ లేనిది.'

-గద్దర్‌తో కందకట్ల రామకృష్ణ



కత్తులు, కర్రలతో ఇరువర్గాల పరస్పర దాడులు

- నలుగురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

కమలాపూర్: పందుల పెంపకం, అమ్మకం విషయంలో తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య దాడులకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు కత్తులు, కర్రలతో దాడి చేసుకోగా ఇరువర్గాలకు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలు కాగా ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ ఘటన కమలాపూర్ మండలంలోని శ్రీరాములపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ బొలుమల్ల సంజీవ్ కథనం ప్రకారం.. పూజారి కుమారస్వామి, పూజారి మహేష్‌లు సమీప బంధువులు. వడ్డెర కులానికి చెందిన వీరిరువురి కుటుంబాల మధ్య గత కొంతకాలంగా పందుల పెంపకానికి, అమ్మకానికి సంబంధించి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గత శనివారం రాత్రి ఇరువర్గాలకు సంబంధించిన వారు అంబాలలో మద్యం సేవించి పందుల పెంపకం, అమ్మకం విషయమై మాట్లాడుకుంటున్నారు. ఈ విషయంలో మాటా మాటా పెరిగి వివాదం తలెత్తింది. అక్కడ కాసేపు వాగ్వాదం జరుగా అనంతరం ఇరువర్గాల వారు తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఇంటికెళ్లిన తర్వాత మరోసారి ఈ విషయమై గొడవ జరుగగా ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు కర్రలు, కత్తులతో పరస్పర దాడులు చేసుకున్నారు. దాడుల్లో పూజారి కుమారస్వామి, పూజారి సమ్మక్క, పూజారి మహేష్, పూజారి సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయాలైన నలుగురిని హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పూజారి దేవి ఫిర్యాదు మేరకు పూజారి సురేష్, మహేష్, సుభాష్‌లపై, పూజారి ప్రవళిక ఫిర్యాదు మేరకు పూజారి కుమారస్వామి, పూజారి వెంకటేష్, పూజారి రాజు ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా ఘటనా స్థలాన్ని కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల మధ్య పరస్పర దాడుల నేపథ్యంలో శ్రీరాములపల్లిలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

స్నేహితుల మధ్య 'కమీషన్' చిచ్చు

- సినిమా తరహాలో ముగ్గురి వీరంగం
- శంభునిపేట జంక్షన్‌లో ఘటన

ఖిలా వరంగల్ : భూమి కొనుగోలుపై వచ్చిన కమీషన్ స్నేహితుల మధ్య చిచ్చు పెట్టింది. నడిరోడ్డుపై ముగ్గురు సినిమా తరహాలో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం గాడిపల్లికి చెందిన ఎలిమి మధు, గొర్రెకుంటకు చెందిన సతీష్, కరీమాబాద్ కాశికుంటకు చెందిన శ్రీకాంత్ స్నేహితులు. దూపకుంట రోడ్డులో ఉన్న ప్లాటును మధు ఇటీవల విక్రయించాడు. వచ్చిన డబ్బులతో శ్రీకాంత్, సతీష్ కలిసి నెక్కొండలోని ఓ ప్లాటును మధుకు ఇప్పిస్తారు. ఇద్దరు స్నేహితులకు కమీషన్ ఇస్తానని మధు అంగీకరిస్తాడు. కానీ, కమీషన్ ఇవ్వకపోవడంతో స్నేహితులు మధుపై ఆగ్రహంతో ఉన్నారు. అయితే, అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా వీరు ముగ్గురు శంభునిపేట జంక్షన్‌లో కలిశారు. ఓ బార్‌లో మద్యం తాగి బయటకు వచ్చారు. మద్యం మత్తులో కమీషన్ కోసం ఒకరితో ఒకరు గొడవపడి దాడి చేసుకున్నారు. మధు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఐదుగురు మృతి చెందారు. ఇసుక లారీ ఢీ కొని ఇద్దరు, రోటవేటర్ కింద పడి రైతు, చలివాగులో కొట్టుకుపోయి వృద్ధు డు, విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందారు.



రాంబాబు (ఫైల్) పవన్ కళ్యాణ్ (ఫైల్)

ములుగు రూరల్: ములుగు మండలంలోని జంగాలపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డతండాకు చెందిన గుగులోత్ పవన్ కళ్యాణ్, నితిన్ కుమార్, భూక్య రాంబాబులు హైదరాబాద్ నుంచి రోళ్లగడ్డ తండాకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున జంగాలపల్లి సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఇసుక లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మెదక్ జిల్లా రామయంపేట మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన రాంబాబు (25), గుండాల మండలం రోళ్లగడ్డతండాకు చెందిన వ్యక్తి పవన్ కల్యాణ్ (24)లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ రాంబాబు మృతి చెందగా పవన్ కల్యాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నితిన్‌కు కాలు విరగడంతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

రోటవేటర్ కింద పడి రైతు..


కేసముద్రం: ప్రమాదవశాత్తు రోటవేటర్ కింద పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటగిరి శివారు చంద్రుతండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన భూక్య బిచ్చా(30) అనే రైతు ఇంటికన్నె గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన మూడున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు అమర్చిన రోటవేటర్‌తో ఇదే తండాకు చెందిన డ్రైవర్ బాలుతో పొలాన్ని దున్నిస్తున్నాడు. ఈ క్రమంలో రోటవేటర్‌లో ఇరుక్కున చెత్తను బిచ్చా తొలగిస్తుండగా గమనించని డ్రైవర్ బాలు ట్రాక్టర్‌ను వెనక్కు నడిపాడు. దీంతో బిచ్చా రోటవేటర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతీ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చలివాగులో పడి వృద్ధుడు..


కొమురయ్య (ఫైల్)

టేకుమట్ల: చలివాగులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాఘవరెడ్డిపేటకు చెందిన బొల్లెపెల్లి కొమురయ్య (65) అనే వ్యక్తి ఆదివారం రాఘవరెడ్డిపేట నుంచి టేకుమట్లకు వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తూ రెండు గ్రామాలకు మధ్య గల చలి వాగును దాటుతున్న క్రమంలో వరదలో కొట్టుకుపోతున్నాడు. ఈ క్రమంలో అక్కడే చేపలు పడుతున్న మత్స్యకారులు తుమ్మల రాజయ్య, చిలుక ప్రశాంత్, తుమ్మల అశోక్, తిప్పనవేని లింగమూర్తిలు కొట్టుకుపోతున్న కొమురయ్యను పట్టుకున్నారు. కానీ అప్పటికే ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా చలి వాగుపై నిర్మించిన హైలెవల్ వంతెనకు అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి..


రాజు (ఫైల్)

జనగామ రూరల్: వెల్డింగ్ పని చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం జనగామ ధర్మకంచలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సానబోయిన రాజు (28) 8 ఏళ్ల నుంచి వెల్డింగ్ పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే తాను నివసిస్తున్న ధర్మకంచలో డబ్బా పని చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రేఖ, నెలన్నర బాబు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ అక్టోబర్ పరీక్షల్లో ఓపెన్ 10th , ఇంటర్, డిగ్రీ, PG, డిప్లొమా, 100%పాస్ గ్యారంటీతో పూర్తి 10th, ఇంటర్, డిగ్రీ, PG, డిప్లొమా, ఫెయిలైతే రీకౌంటింగ్ ద్వారా పాస్ సౌకర్యంపైనేతో అడ్మిషన్స్ కలవ.6305979755 [H-189378]

REAL ESTATE

HOUSE FOR SALE

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ।।గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785639]

■ కేవలం రూ।। 25 లక్షలకే డబుల్ బెడ్ రూం హౌస్ విత్ ఫర్నీచర్‌తో EMI పద్దతిలో అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9933]

TO-LET

■ To-Let 2BHK Marble Stone Fitting, 1000+1000 Sq. Feet Wide Space Big House For Residential & Office 1st Floor, @ Waranagal Under Bridge. Ph: 9440170497. [HA-484]

PLOT FOR SALE

■ AMR Township నందు కమర్షియల్ ప్లాట్స్ రఘునాథపల్లి Toll Plaza, 163 Highway Facingతో అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9931]

■ వరంగల్ నుండి 18 కి.మీ. దూరంలో కేవలం 7 లక్షలకే 200 చ।।గ।।ల రిజిస్ట్రేషన్ ప్లాటు (E/F) అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9932]

SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189119]

■ అతితక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్నా ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

■ మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

BUSINESS OFFER

■ RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana - 2.5 L. 50Kg's vacuum packed prawns / day. Rs.600 / pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433. [WB-19489]

OLD AGE HOME

■ త్రివేణి హోంకేర్: వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్: 9160900023, 9160900024. [H-189316]

WANTED

■ గణేష్ టింబర్ డిపో కమలాపూర్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. సంప్ర।। సెల్: 9440471253. [W-785637]

■ శ్రీ సంతోష్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూరు బ్రాంచిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్, TA + DA ఇవ్వబడును. సెల్: 7702403972. [W-785636]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్ర।। 9703637320. [W-189117]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పని చేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- సెల్: 9032212334, 8247548979. [W-785700]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. సెల్: 88854 86421. [M-1221475]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-189314]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.